# మంచుతెర

రాజశేఖరం రైలు స్పీడందుకున్న తరువాత తలుపు దగ్గర నుండి వెనక్కి వచ్చి, సూట్కేసు పక్కగా కూర్చున్నాడు. ఆ మొదటి తరగతి రైలు పెట్టెలో ఒంటరి ప్రయాణం బిక్కు బిక్కు మంటోంది.

నైట్ గవునులో ముడుచుకు కూర్చున్నా చలి నేనున్నానంటూ' శరీరాన్ని తట్టి చెబుతోంది. అప్పటికీ సిగిరెట్టును లైటర్ తో వెలిగించి, గట్టిగా దమ్ములాగాడు.

రాజేశ్వరి గుర్తుకు వచ్చింది— ఏం చేస్తున్నదో?

తను ఎక్కడ 'వాళ్ల' మాయమాటల్లో పడిపోతానో అని గాభరాతో నిద్రపోకుండా ఆలోచిస్తుంటుంది!

'వాళ్లు'— అనుకుండే టప్పటికల్లా చచ్చిపోయిన తండ్రి గుర్తుకు వచ్చాడు. సాయంత్రం ఐదు గంటలప్పుడు 'వాళ్ల' దగ్గర నుండి వచ్చిన టెలిగ్రాం గుర్తుకు వచ్చింది.

"నాన్నగారు పోయారు...వెంటనే బయల్దేరు!"

—రాబర్టు"

రాబర్ట్!— తను అతడికి అన్నయ్య అనుకుంటాడు! తనకు మాత్రం అప్పుడప్పుడూ ఆలా అనిపించదా? ...ఏమో?... అహం... ఆలా అనుకోవాలంటే వెగటేస్తోంది—రాబర్ట్ తనకు తమ్ముడా!

శశికళ!— రాబర్ట్ చెల్లెలు— అయితే నాన్న మాత్రం తన తల్లి జ్ఞాపకార్థం ఆ పేరు పెట్టి పిలుచుకుంటున్నట్లుగా జీవితంలో కనబడ్డ అతి తక్కువ సార్లలో ఒకసారి చెప్పినట్లు గుర్తు!

ఆమె!— తన తండ్రికి— ఊహూఁ ఎందుకు ఇప్పుడవన్నీ……

పెట్టెలో నుండి దుప్పటి తీశాడు. కంపార్టుమెంటు డోర్ లోపల గడియ వేశాడు. సూట్కేసు పక్కగా పెట్టి సీటుమీద పడుకొని దుప్పటి కప్పుకున్నాడు.

రేపొద్దున తను వెళతాడు వాళ్లింటికి. తనను చూచి వాళ్లు—ఇదివరకు ఒకటి రెండు సార్లు చూచారు గాబట్టి గుర్తు పట్టవచ్చు.

కూర్చోమంటారు.

కూర్చుంటాడు.

'ఎలా మాట్లాడించాలి?'

"అఁ…" ఒక్కక్షణం తటపటాయించి, "వారికి… ఊహూఁ…నాన్నగారికి ఏం జబ్బు చేసింది?" అడుగుతాడు.

ఆ ప్రశ్నకు బహుశా, రాబర్టు, శశికళ ఆమె కూడా ఏడ్వవచ్చు!

తనకు ఏడ్పు వస్తుందో, రాదో!

కానీ రాజేశ్వరి భయం వేరు— తను ఏడ్చేవాళ్ళను చూచి ఎక్కడ ఏడ్చేస్తాడోనని— ఏడుస్తాడని భయం లేక

పోయినా ఆ ఏడుపులో వాళ్లకు ఏం వాగ్దానాలు ఇచ్చేస్తాడో నని!

రెండొందల మైళ్ల దూరాన్ని మరునాడు ఉదయానికి గాని చేరుకోలేకపోయాడు రాజశేఖరం.

దూరం నుండే ఇంటిని గుర్తుపట్టాడు. చిన్న పెంకుటిల్లు. అక్కడక్కడా పెంకులు గూడా లేచిపోయినయి. రోడ్డు మీదకున్న గోడ ఉప్పు చౌడు రాలుస్తోంది. పక్కనున్న వేపచెట్టు మరీ పెరిగి పోయిందనిపిస్తోంది. మరీ నిశితంగా చూస్తే, ఆ యిల్లు అవసాన దశకు దగ్గర పడుతున్న దేఁవోననిపిస్తోంది!

నాపరాతి బండ మీద కాలు పెట్టాడు. సూట్కేసు ఎడం చేతిలో వున్నది— రాత్రి తెల్లవార్లూ ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో నిద్రపోయినా తలంతా నాజుగ్గా వున్నది.

"రాబర్ట్!" గొళ్లాన్ని తలుపు మీద కొట్టాడు. ఎందుకో కంఠం వణికింది.

తలుపు తీసింది శశికళ!

శశికళ అతడి వంక తేరిపార జూచింది ఒక్కక్షణం కళ్లు ముడుచుకుంది.

పదేళ్ల క్రితం— అంటే శశికళకు పదేళ్లప్పుడు— చూడటంతో, తనను గుర్తు పట్టలేకపోతున్న దేమో అనుకున్నాడు.

శశికళ తన తండ్రి లాగానే వుంటుంది!

"రాబర్ట్ లేడా?"

క్షణం తడబడ్డాడు. "తమ్ముడు లేడా?" అంటే గుర్తు పట్టేదేమో?

శశికళ మరుక్షణంలోనే అర్థం చేసుకుంది. చటుక్కున వెనక్కి తిరిగింది. "రా! అన్నయ్యా!" అంది. వెంటనే ఏమనుకున్నదో ఏమో "రండి!" అంటూ పరుగెడుతున్నట్లుగా లోపలకు అడుగులు వేసింది.

ఒక చేయి విరిగిన కుర్చీ తీసుకువచ్చి వరండాలో వేసింది. చెంబుతో నీళ్లు తెచ్చింది.

"కాళ్లు కడుక్కోండి!"

"రాబర్ట్ లేడా?" అరిగిపోయిన గ్రామఫోను రికార్డులా వెగటుగా వున్నది తన ప్రశ్న!

"వస్తాడు!...ఇప్పుడే వస్తాడు...ఎక్కడికో వెళ్లాడు!" ఆమె చివరి మాట నాలిక మీద వుండగానే రాబర్టు లోపలికి వచ్చాడు.

వస్తూనే సంతోషంగా, "నమస్కారం అన్నయ్యా!"

రాజశేఖరం లేచి నిలబడ్డాడు. "నమస్తే" బెరుగ్గా అన్నాడు.

"ఇప్పుడేనా రావటం?"

"అవును!"

తరువాత నిశ్శబ్దం ఆ ప్రదేశాన్నంతా అలుముకుంది. ఆ నిశ్శబ్దం అతి భయంకరంగా వున్నట్లనిపించింది, రాజశేఖ

రానికి —కొద్ది క్షణాల్లో ఏదో బ్రద్దలవ్వబోతున్నట్లుగా ఫీలయ్యాడు.

రాబర్టు తల వంచుకున్నాడు.

రాజశేఖరం తల ఎత్తి రాబర్ట్ మొఖం లోకి చూశాడు.

అతడి కళ్ల వెంట నీరు ధారలగా కారుతోంది. నల్లటి అతడి మొఖం మరింతగా నల్లబడిపోతోంది—అతడు సర్వం పోగొట్టుకున్న వాడిలా డీలాపడిపోతున్నాడు.

రాజశేఖరం హృదయం జాలితో కరిగిపోయింది.

"నాన్నగారు!..." గొంతు గద్గదికమయింది.

"అంతా అనుకోకుండా జరిగిపోయింది. హార్ట్ ఎటాక్... రెండు గంటలుమాత్రం అది వచ్చింతరువాత ఈ భూమ్మీద ఉండగలిగారు ..చివరి క్షణాల్లో ఒకటి రెండు సార్లు మిమ్మల్ని అనుకున్నారు గూడా... మీకు తన క్షమాపణలు చెప్పమన్నారు..."

రాజశేఖరం కళ్లు తడి అవ్వటం మొదలు పెట్టినయి.

ఏమిటో తెలియని బాధ హృదయాన్నంతా కెలికింది.

"తన తండ్రిపోయాడు!" అన్న నగ్నసత్యం అప్పుడే తెలుసుకున్నట్లుగా గిలగిల లాడిపోయాడు.

క్షణంలో కుర్చీలో కూలబడిపోయాడు.

రెండు చేతులతో మొఖాన్ని కప్పుకున్నాడు.

లోపలినుండి సన్నని ఏడుపు వినిపించసాగింది.

తలుపు ప్రక్కగా నిల్చున్న శశికళ గూడా ఏడుస్తున్న దేమోననిపించింది.

ఎంత దాచుకుందామని ప్రయత్నించినా, రాజశేఖరం —ఆ తెలియని బాధను దాచుకోలేకపోయాడు!

"ప్చ్! కానీయండి…భగవంతుడి దగ్గరకు వెళ్లిన ప్రతివాడూ అదృష్టవంతుడే…అతడు కావాల్సినవాళ్లే దుర దృష్టవంతులయిపోతారు!" రాబర్ట్ పెదిమలు అల్లల్లాడినయ్ దుఃఖంతో.

తిరిగి నిశ్శబ్ద మావరించింది.

ఒక్క క్షణంగాదు— పది నిముషాలు!

ఎక్కడో ఏదో— వెగటుగా వస్తున్న శబ్దం— అచ్చం ఆ గృహమే ఏడుస్తున్నట్లున్నది.

కోలుకున్న తరువాత—రాబర్ట్ అన్నాడు. "అమ్మా! శశీ! అన్నయ్యకు కాఫీ ఇవ్వు!"

రాజశేఖరం త్వర త్వరగా అన్నాడు: "తాగి వచ్చాను!"

—ఎందుకో అనుకోకుండా అబద్ధమాడేశాడు!

"ఫరవాలేదు అన్నయ్యా!…అః…అసలు ముందు, మొఖం కడుక్కున్నావా?" హడావుడి చేయసాగాడు.

తొమ్మిది గంటలయింది రాజశేఖరం స్నానం చేసే టప్పటికి.

అసలు స్నానం చేయబోయేముందే—

రాజశేఖరం అన్నాడు. "హడావుడేం పడవద్దు... నేను హోటల్‌కు వెళ్ళామనుకుంటున్నాను!"

రాబర్ట్ హృదయం బాధతో కుమిలిపోయింది. "అన్నయ్యా!" కళ్ళు అశ్రుపూరితాలయినయి. "ఈరోజున నాన్నగారువున్నా లేకపోయినా... ఈ గృహంలో నాకెంత అధికారమున్నదో, నీకూ అంతే ఉన్నదన్నయ్యా! నీవు ఇంటికి పెద్దవాడివి.. నీవే ఇలా అంటే...?" దుఃఖం పొర్లుకొచ్చింది. మాట బిగుసుకుపోయింది.

రాజశేఖరం తొందర పడ్డానేమో అనుకున్నాడు. బాధపడ్డాడు.

"లేదు... లేదు..." తడబడ్డాడు గూడా, "ఇక్కడే ఉంటాను రాబర్ట్...ఇక్కడే ఉంటాను!" గొణిగాడు. కళ్ళు చెమర్చినయ్.

రాజేశ్వరి గుర్తుకు వచ్చింది. ఆమె నవ్వుతున్నట్లనిపించింది. "వాళ్లు మిమ్మల్ని వల్లో వేసుకోవట మనేది ఖాయం...వాళ్లనాన్నకు మీరు కుమారులని గాదు ..మీ డబ్బు చూసి...అంతే" అన్నట్లుగా గూడా అనిపించింది.

"లేదు రాజేశ్వరీ! రాబర్ట్‌ని—అతి నిర్మలంగా మాట్లాడుతున్న అతడిని నేనలా వూహించుకోలేను!" హృదయంలోనే బిగించికున్నాడు సమాధానాన్ని.

తొమ్మిదిన్నరకు— అప్పటికే ఎండ— రాక్షసుడు మనిషిని చూసే చూపుతో— ఆ ప్రదేశాన్ని చూస్తోంది.

రాబర్ట్, రాజశేఖరం, శశికళ గ్రేవ్‌యార్డుకు బయల్దేరారు.

ఆ ఎత్తు తక్కువగావున్న కాంపౌండ్ వాల్ నడుమ —సంతలో మనుష్యుల్లా—సమాధులు ఒకదాని ప్రక్కన ఒకటి కిక్కిరిసి ఉన్నాయి.

అంతా—నూతనంగా నిర్మించిన మరో ప్రపంచంలో శాశ్వత విశ్రాంతి పొందుతున్న— ఆయన సమాధి దగ్గర నిలబడ్డారు.

రాబర్ట్ మోకాళ్ళమీద కూర్చొని— ముందుకు వంగి ఏవేవో అనసాగాడు గొణుగుతున్నట్లుగా. శశికళ ఒక పువ్వును— నందివర్ధనంగాబోలు—రాబర్ట్‌కు అందించింది.

శాశ్వత నిద్రలో మునిగివున్న తన తండ్రిని కప్పివేస్తూ కట్టబడిన ఆ సమాధిమీద 'ప్రభువునందు నిద్రించెను' అని చెక్కబడిన అక్షరాలను తదేకంగా చూస్తూ కొన్ని క్షణాలు గడిపివేశాడు రాజశేఖరం.

శశికళ రాజశేఖరానికి ఒక పువ్వు నందించింది.

రాజశేఖరం మోకాళ్లమీద కూర్చున్నాడు. ఆ పువ్వును సమాధిమీద ఉంచుతూ "నాకు ఈ జన్మ నిచ్చిన మీకు నా హృదయంలో సరియైన స్థానం ఇవ్వలేదేమో ననిపిస్తోంది...ఏమైనా కానీయండి..అవన్నీ ఎందుకు ఇప్పుడు..

నన్ను మాత్రం హృదయపూర్వకంగా క్షమిస్తారనే ఆశిస్తాను!'' అన్నాడు.

ముగ్గురూ ఇంటికి వచ్చేటప్పటికి పదకొండు గంటలైంది. ఎండ అప్పటికే—అందరినీ జయించి—ప్రపంచం మీద సర్వాధిపత్యం వహించినట్లుగా విర్రవీగుతోంది!

మధ్యాహ్నం మూడు గంటలప్పుడు తిరిగి ఆ గృహాన్ని నిశ్శబ్దం రాజ్యం చేస్తున్నప్పుడు—రాబర్ట్ మొట్టమొదటిసారిగా మాట్లాడటం మొదలుపెట్టాడు.

రాజశేఖరం భయపడ్డాడు.

ఎన్నో సంవత్సరాల క్రితం—తన తల్లి తనకు జన్మనిచ్చి మరణించిన తరువాత—మరో రెండు సంవత్సరాలకే తండ్రి తనను, తన ఆస్తిని తాత దగ్గర విడిచి గృహంనుండి వెళ్ళిపోయాడు—ఆపైన ఐదు సంవత్సరాలకు తెలిసిందిట—అప్పటికి రెండు సంవత్సరాల క్రితమే ఆయన ఒక క్రిస్టియన్ యువతిని వివాహం చేసుకున్నాడని—వాళ్ళకు ఒకపుత్రుడు గూడా కలిగాడనీ!—

అదే రాజేశ్వరి భయం— తన ఆస్తిమీద హక్కు ఉన్నదంటూ వాళ్లెక్కడ వస్తారో నని— వాళ్ల మాటలకు తను ఎక్కడ తల ఒగ్గుతాడో నని!— అసలు రాజేశ్వరి భయపడవలసిన అవసరం లేదు— ఆ ఆస్తంతా తన తాత స్వార్జితం—తనకు వ్రాసి ఇచ్చాడు—రాబర్ట్‌కు అందులో భాగం అడిగే హక్కే లేదు అసలు.

అయినా రాజేశ్వరి భయం రాజేశ్వరిదే. రాబర్టు మాటలను కొనసాగనీయకుండానే రాజశేఖరం అన్నాడు: "తిరిగి బండి ఎన్ని గంటలకు ఉన్నది నాకు?"

"అదేమిటి—అప్పుడే వెళ్ళిపోతావా?" త్వరత్వరగా అన్నాడు రాబర్టు. "లేదు! నీవు నాలుగులోజులైనా ఇక్కడ ఉండాలి!"

రాజశేఖరం బరువుగా నవ్వాడు. "లేదు రాబర్ట్! రేపు హెడ్డాఫీసునుంచి ఎవరో వస్తున్నారు.. నేను లేకుండా వుండ గూడదు... టెలిగ్రాం చూచి హడావుడి పడుతూ వచ్చేశాను...అక్కడ ఎరేంజిమెంట్సు గూడా సరిగ్గా చేశానో లేదో? ... అన్నీ నేనే చూడాలి!" అన్నాడు. తరువాత ఒక నిట్టూర్పు విడిచి "ఇంత సంపాదిస్తున్నా ఏం లాభం...క్షణం తీరిక ఉండదూ...నయాపైసా మిగలనూ మిగలదు!" తన గొంతు తెచ్చిపెట్టుకున్న వికారంలా ఉన్నది—తను బుజాలు తడుముకుంటున్నట్లే అనిపించింది-ఎందుకు అలా అన్నానా అని తరువాత బాధపడ్డాడు గూడా!

శశికళ రెండు కప్పుల్తో కాఫీ తెచ్చి చేయి విరిగిన కుర్చీని రెండు మంచాల మధ్యకు లాగి, దానిమీద పెట్టింది.

కాఫీ సిప్ చేస్తూ రాబర్టు తల వంచుకొని అన్నాడు: "నాన్నగారు ఉంటే ఈలాంటి బాధలన్నీ నాకు తెలిసేవి గాదు - ఆయనేదో తిప్పలు పడుతుండేవారు...శశికళకు

పెళ్ళీడు వచ్చింది. అసలు వివాహం కూడా కొద్ది నెలల్లోనే జరుగవలసి ఉన్నది. కానీ అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగింది...ఏదైనా కానీయ్. వచ్చే సంవత్సరం చేద్దామనుకుంటున్నాను... అందుకే ఈ విషయం నీతో మాట్లాడుదామనుకుంటున్నాను!'' నీళ్ళు నములుతున్నట్లుగా మాట్లాడసాగాడు.

రాజశేఖరం కళ్ళముందు రాజేశ్వరి తిష్టవేసుకు కూర్చుంది. ''అసలు రంగంలోకి అతగాడు దిగబోతున్నాడు...మీరు జాగ్రత్తగా మాటలు తూచి తూచి అందీ అందకుండా మాట్లాడండి!'' హెచ్చరించింది.

రాజశేఖరం దగ్గుతున్నట్లుగా గొంతు సవరించుకున్నాడు.

రాబర్టు తిరిగి మాట్లాడసాగాడు: ''ఇక ఆలస్యం చేయలేను...ఇప్పటికే శశికళకు ఇరవై సంవత్సరాలు దాటినయ్!''

''నిజమే మరి ... ఆలస్యం చేయగూడదు!'' అంటీ అంటనట్లుగా అన్నాడు రాజశేఖరం.

కళ్ళు సగం మూసుకున్నాడు.

రాబర్టు తల వంచుకున్నాడు.

''అందుకే...అందుకే!'' గొంతు మొరాయించింది. ''మీ సహాయం కావాల్సి ఉన్నది అన్నయ్యా! ... అలా అడగాలంటే నాకే సిగ్గుగా ఉన్నది!''

మొట్టమొదటిసారిగా రాజశేఖరానికి రాజేశ్వరి భయం నిజమనిపించింది - ఇబ్బంది పడుతున్నట్లుగా అటూ ఇటూ కదిలాడు.

రాబర్టు గొంతు పూడుకుపోయింది— తన మీద, తన పరిస్థితులమీద— తనకే అసహ్యంతో!

"అన్నయ్యా! ఈనాడు నేను ఈలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు... ఆయన నాకు జీవితంలోని కష్టనష్టాలకు ఆదుకుని నిలబడతా రనుకున్నాను... కాని... ప్రభువుకు నాయందు దయలేదు!" కళ్ల వెంట నీరు గిర్రున తిరిగింది.

ఆ పరిస్థితులలో మరీ మవునంగా ఉండటానికి రాజశేఖరానికి మనస్కరించలేదు. అందుకనే—"నీవేం భయపడవద్దు రాబర్ట్.... దేవుడు ఏలా రాసిపెట్టి ఉంటే అలా అవుతుంది... దానికోసరమని అనవసరంగా బుర్రలు పాడు చేసుకోవటం దేనికి?" అన్నాడు వోదార్పు కంఠంతో.

"అవుననుకో... అయినా మన ప్రయత్నం మనం చేయాలిగదా!"

"అవునవును!" అన్నాడు—ఎటూ తను ఈపరిస్థితుల నుండి తప్పించుకోలేనట్లుగా.

రాజశేఖరం అంతరంగలో కలవరపడసాగాడు.

"నిజమే— రాజేశ్వరి అన్న మాటలు నిజం!"

రాబర్టు ఇక ఆలస్యం చేయగూడ దన్నట్లుగా— తలెత్తి సూటిగా రాజశేఖరం కళ్లల్లోకి చూస్తూ, "ఎంత లేదన్నా శశికళ వివాహానికి రెండు వేలయినా కావాల్సి ఉంటాయి—అందుకే..." గొంతు పెగల్లేదు.

రాజశేఖరం కళ్లార్పకుండా వూపిరి బిగపట్టుకొని రాబర్టు కళ్లల్లోకి చూస్తున్నాడు.

"_అందుకే..ఈ యిల్లు అమ్ముదామనుకుంటున్నాను.. ఈ యిల్లు నాన్నగారి స్వార్జితం.... బహుశః ఆరు వేలదాకా రావచ్చు.... మనిద్దరం చెరో మూడువేలు తీసుకుందాం.... నా దాంట్లో రెండువేలు పెండ్లికి ఖర్చుపెట్టి...మిగతాదాన్తో మా స్కూలుకు దగ్గరగా చిన్నపూరిల్లు వేసుకుందా మను కుంటున్నాను..."

రాజశేఖరం ఉలిక్కిపడ్డాడు. వెనుకనుండి ఎవరో నెత్తిన బాదినట్లనిపించింది— రాబర్టు ఏం అంటున్నాడు ?

—నాన్నగారి స్వార్జితమైన ఈ పెంకుటింట్లో—ఆయన పెద్దకొడుకైన తనకు సగభాగ మిస్తానంటున్నాడు!

నిజంగా— రాజశేఖరం వూపిరి సల్పుకోలేని— మగతతో పడిపోతున్నట్లుగా డీలా పడిపోసాగాడు.

ఒక్కసారిగా—తన సంకుచిత హృదయం, రాజేశ్వరి మనస్సు, వూహలు—గుర్తుకు తెచ్చుకొని— సిగ్గుతో తల దించేసుకున్నాడు.

ఆ క్షణంలో ఎవరో ఆతడి జ్ఞాననేత్రం తెరిచినట్లు అనిపించగా...బాధతో విలవిలలాడిపోయాడు.

ఛీ! ఛీ!-తను వాళ్లని ఏలా వూహించుకున్నాడు?

క్షణం అంతకుముందు వూహాలు మనస్సులో మెదిలి నప్పుడు మొహమంతా తెల్లబడిపోయింది ... ఎక్కడికో, ఎవరికీ కనబడని చీకటి ప్రదేశంలోకి పారిపోయి దాక్కో-వా లనిపించింది. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ఆ ప్రదేశంనుండి - శరీరాన్ని శల్యం చేస్తున్న ఆ ప్రదేశం నుండి - పరుగెత్తి వెళ్లిపోవా లనిపిస్తున్నది.

"రాజేశ్వరీ!... ఈ నాడు - తొలిసారిగా జీవితంలో- మమతా, ప్రేమ - అంటే ఏఁవిటో తెలుసుకోగలిగాను రాజేశ్వరీ!" బిగ్గరగా ఏడవాలనిపించింది.

"ఏఁవన్నయ్యా! మాట్లాడవ్!...ఏఁవంటావ్?... ఈ ఇల్లు అమ్మటానికి నీకు అంగీకారమేనా?...పరిస్థితులు అలా వచ్చినయ్యన్నయ్యా! ... అంతకుమించి నేను చేయగలిగిం దేఁవీ లేదు..."

రాబర్టు మాటలు సూదుల్లా గుచ్చుకుంటుంటే రాజ శేఖరం గొంతు విప్పాడు.

"లేదు తమ్ముడూ! ... వద్దు! ... చెల్లి పెళ్లికి ఇల్లు ఎందుకు అమ్మాలి?...అక్కర లేదు...చెల్లి పెళ్లి విషయంలో నీ కెంత బాధ్యత ఉన్నదో...మీకు పెద్దన్నయ్యగా అంత కంటే ఎక్కువ బాధ్యతే నాకు ఉన్నది...నాన్నగారి తరు-

వాత నేను చూచుకోవాల్సిన విషయాలు అవి! ... నీవేం బాధపడవద్దు...ఆమె వివాహం అతి వైభవంగా జరిపించే పూచీ నాది...!''

జీవితంలో - నలభై సంవత్సరాల జీవితంలో - తొలి సారిగా మరో మానవుడితో - అందునా ఇన్నాళ్ళూ లేడను కుంటున్న తమ్ముడితో - హృదయం విప్పి మాట్లాడినట్లని పించింది!—

అలా మాట్లాడుతున్నప్పుడు - ఉహూఁ. ... అంతే కాదు...తిరిగి ఇంటికి వెళ్ళేటంత వరకూ కూడా...రాజేశ్వరి గుర్తుకు రాలేదు!

ఎందుకంటె—

ఏమో?

—శుభం—